అందరూ మళ్ళీ కోరినందువల్ల
నల్లి కథలు మరోమారు మీకోసం

పెద్దలను గౌరవించకపోతే...?

ఒక నదీ తీరమున ఒక కుగ్రామం ఉంటూంది. ఆ నదీ తీరము పచ్చని పచ్చిక బయళ్లలో కనుల మనోహరంగా ఉండడమే గాకుండా, ఆ వూరి మేకల కాపరులు తమ మేకలు పచ్చిక మేయడానికి ఆ నదీతీరానికి తోలుకుని వస్తూండేవారు. ఆ నదిలో ఉంటున్న ఓ ముసలి రోజూ ఒక మేకను పట్టి తినేస్తూండేది.

రోజూ ఒక మేకను కోల్పోవడం మేకల కాపరికీ, యజమానికీ పెద్ద సమస్యగా మారింది. ఆ మొసలిని ఏ విధంగా చంపాలన్నా వీలుకాకున్నది. నీటిలో నున్న మొసలి ఏనుగుకన్నా బలమైందనే విషయం మీకు తెలిసిందే! మొసలి బయటకు రాకపోడం, అదును జూచి మేకను లాగుకుని పోవడం జూచి, ఏంవీ చేయలేకపోతున్నాడా మేకలకాపరి. మరో చోట మందలను మేపుదామంటే పచ్చిక బయళ్ళంతగా ఆ గ్రామంలో లేవు. ఇంకెక్కడా పశుగ్రాసం (పచ్చిక బయళ్ళు) లేకపోవడంతో, పశువులకాపరికి ఆ నదీ తీరం తప్ప వేఱే ప్రదేశం లేదని వాపోతున్నాడు.

ఓ రోజు విచారంగా యింటికి వచ్చిన మేకలకాపరిని జూచి నాయనమ్మ ప్రశ్నించింది. ఏం నాయనా, రోజూ సాయంత్రం ఇంటికి విచారంగా వస్తున్నావే, కారణం ఏంవిటి? అని అడిగింది. వంటింట్లో ఉండే ముసలిదేంవి చెప్పగలదని నిస్సాకార భావంతో ఊరుకున్నాడు. మనుమడి నిర్లక్ష్యాన్ని చూచి ముసలమ్మ



రెట్టించి అడుగగా విషయం వివరించి చెప్పాడు. వాడి మనఃక్లేశాన్ని ముసలమ్మ గ్రహించింది. ఓసి అదేనా నీచింత? ఈ మాత్రం దానికే బాధపడాలి? ఉపాయాన్ని ఆలోచించాలేగానీ విచారం చెందకూడదు. అందుకే మావాళ్లు ఉపాయం తోచని వాణ్ణి ఊళ్ళోంచి వెళ్ళగొట్టమన్నారు అంటూ చెవిలో ఒక ఉపాయం చెప్పింది. ఆ ఉపాయంతో వాడి ముఖం నెమలి పింఛంలా విప్పారింది. బామ్మమాట మేలిమి బంగారు మూట అనుకుని బయల్దేరాడు.

నదీ తీరానికి వెళ్లాడు, బామ్మ సలహా ప్రకారం ఒక మేకపిల్లను చంపాడు. చచ్చినదాని నోటిలో ముగ్గుగుల్లలు నీరు చేరకుండా కొంచెం కొంచెం కూరి కూరి నింపాడు. అంతకు ముందు సున్నం కూడా కూరాడు. సజీవంగా ఆ మేక కనబడేట్టుగా నీటి తీరంలో నిలబెట్టాడు. అలవాటు ప్రకారం పచ్చికమేయడానికి తీరానికి వచ్చే మేకల్ని పట్టి లాగుకుని పోయే మొసలి వచ్చి, చటుక్కున ఆ మేకను నీటిలోకి లాగుకుని పోయింది. దానిని భక్షించింది. తదుపరి అలవాటు ప్రకారం నీటిని త్రాగింది. త్రాగిన ఆ నీరు పొట్టలోనికి వెళ్లేసరికి, పొట్టలోని ముగ్గుగుల్లలూ, సున్నమూ కుతకుత ఉడికి పొంగాయ్. అంతే ఏముంది? మొసలి కడుపులోని ప్రేగులూ, పొట్టపొంగి, మొసలి అటూ ఇటూ దొరలుకుంటూ ఒడ్డుకు వచ్చి ఇసుకలో విలవిలలాడుతూ కొట్టుకుని చనిపోయింది.

మొసలి పీడ విరగడైపోయినందుకు పశువుల కాపరికీ, యజమానికీ ప్రశాంతత చేకూరింది. కళ్లారా బామ్మ చెప్పిన ఉపాయం ఫలించినందుకు ఎంతగానో సంతోషపడ్డాడు. పెద్దలపట్ల వృద్ధులపట్ల అలక్ష్యం చూపేవారికీ, గౌరవ, వాత్సల్యాభిమానాలు చూపనివారికీ ఈ కథ జ్ఞానోదయాన్ని కలిగిస్తుందనే భావిస్తున్నాను.

భారతదేశంలో మన యువత, పెద్దలపట్ల అమిత పూజ్య భావన కలిగే ఉండేవారు. ఇంట్లో పెద్ద దిక్కు లేకపోతే, ఇరుగు పొరుగు పెద్దల్ని గౌరవించేవారు,

సలహాలు పొందేవారు. ఇటీవల వచ్చిన పాశ్యాత్య నాగరికతా ప్రభావం ఆ ప్రభావాన్ని సమ్మూళంగా నాశనం చేసింది. ఈ మూడుకాళ్ళ ముసలలు చెప్పిదేం విటి అంటూ అలక్ష్యం చేస్తున్నారు. కానీ జపానులో మాత్రం పెద్దలపట్ల గౌరవభావం కొనసాగుతూనే ఉందనడానికే ఈ క్రింది కథను విశ్లేషిస్తున్నాము:

ఒక జపాను రాజుకు వయసు పొగరూ, వగరూ, దుడుకూ హెచ్చుగా ఉండేది. దానితో తన రాజ్యంలో అరవైయేళ్లు దాటిన వారంతా అనవసరమని భావించాడు. అలాంటి వారిని శిరచ్ఛేదనం చేసి చంపమని ఆజ్ఞాపించాడు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా, అన్నట్టు- ఆయన ఆజ్ఞను ఉద్యోగులంతా శిరసా వహించారు. ఒక వీరుడు మాత్రం రాజాజ్ఞను ధిక్కరించాడు. అతనికి తండ్రిపై పూజ్యాభావం ఉండడం వలన చంపలేకపోయాడు. ఎవరూ చూడని ప్రదేశంలో తండ్రిని దాచి ఉంచాడు. చాటుమాటుగా వెళ్లి ఆయనకు సపర్యలు చేస్తూండేవాడు, చూస్తూండేవాడు. ఈ విషయం రెండో కంటికి తెలియకుండా జాగరూకత వహించేవాడు.

ఇలా ఉంటూండగా ఆ రాజు పొరుగు రాజ్యంపై యుద్ధం చేయాల్సివచ్చింది. యుద్ధానికి వెడ్తూ, తనతో లక్షమంది సైన్యాన్ని కూడా తీసుకుని వెళ్లాడు. తండ్రిని సదాకాపాడుకుంటున్న సైనికుడు మాత్రం తన తండ్రిని వీపున ధరించే సంచిలో భద్రంగా దాచి, రాజసైన్యంతో అనుసరిస్తూ వెడుతూన్నాడు.

ఒక సముద్రపుటొడ్డున అందరు సైనికులు, రాజూ గుడారములు వేసుకుని, సేదతీరుతూ, యుద్ధ ప్రయత్నాలకు పథకాలు వేస్తున్నారు. రాజుకు అక్కడి ప్రకృతి ప్రశాంతత ఆనందం కలిగించింది. సైనికులందరూ ఆటలూ పాటలతో ఆనందాబ్ధిలో మునిగితేలియాడుతున్నారు. ఆ సమయంలో సైనికుడు తన తండ్రికి సైత్యోపచారములు చేసి ఆహారం పెడ్తున్నాడు. బయట కోలహలాన్ని జూచిన ఆ వృద్ధమూర్తి, 'కుమారా బయటంత కోలాహలంగా ఉందేంవిటి?' అంటూ ప్రశ్నించాడు.

'తండ్రీ- ఎప్పుడూ అలలో ఘోషపెట్టే సముద్రం అలల అలజడి లేకుండా ప్రశాంతంగా ఉన్నది. అందరూ సాగర ప్రశాంతతను జూచి ఆశ్చర్యంగా, ఆహ్లాదకరంగా సంబర సంభరితులై నృత్యం చేస్తున్నారు.' అంటూ సమాధానమిచ్చాడు.

'అయితే కుమారా- ఆకాశంలోని పక్షులు ఏ దిశగా విహరిస్తున్నాయో చెప్పు' అని అడిగాడు తండ్రి.

అవి విహరిస్తున్న దిశను కొడుకు చూచి చెప్పగానే ఈ రీతిని పక్షులు విదశగా విహరిస్తూ, సముద్రం అలల రహితంగా ఉందంటే- వాతావరణంలో మార్పు వచ్చింది. అతి పెద్ద తుఫాను దశకు దారి తీస్తుందన్నమాట- ఆ సంకేతానికే ఈ ప్రశాంతత, విహంగాల వ్యతిరేక విహారం, దీన్ని మనం ప్రశాంతంగా గాకుండా ప్రమాద హెచ్చరికగా గ్రహించాలి, కొంతసేపటిలో సముద్రం ఉప్పొంగవచ్చు, పరిసర భూప్రదేశాన్ని నీటితో ముంచవచ్చు, అందరూ ఇచ్చట నుంచి వెంటనే వేఱే ప్రదేశానికి వెళ్ళడం మంచిది, లేనిచో ఆపదను కొని తెచ్చుక్కున్నట్టవుతుంది' అన్నాడు.

కుమారుడు వెంటనే రాజుగారిని దర్శించి, అశరీరవాణి తనకీ విధంగా వివరించినట్టు, ప్రమాదం పొంచివున్నట్టూ చెప్పాడు. దానితో రాజుగారు అక్కడ గుడారాలన్నిటినీ తీసి వేయించారు. ఆ ప్రదేశాన్ని ఖాళీచేసి, గుర్రాలు అధిరోహించి వెడ్తూంటే, సముద్ర తరంగాలు ఆకాశమెత్తున ఉప్పొంగుతూ, క్షణాల్లో అక్కడి ప్రదేశాన్ని ముంచెత్తి వేసింది. సైనికుని సలహా ననుసరించి మకాము మార్చిన రాజుగారు తన ప్రాణాల్నీ, తనతోబాటు లక్షమంది సైనికుల ప్రాణాల్నీ కాపాడకలిగాడు. వెంటనే ప్రాణాల్ని కాపాడిన సైనికుడ్ని పిలిపించారు. ఆ అశరీరవాణి నీ ఒక్కడికే చెప్పడం ఏంవిటి? అంటూ నిజం తెలుసుకోవాలనెడి ఆసక్తితో నిలదీసినట్టు ప్రశ్నించారు. తండ్రి సదా సత్యం పలుకాలని చెప్పే మాటలు జ్ఞాపకం వచ్చి, ఆ సైనికుడు నిజం చెప్పాడు. తన తండ్రి పట్ల తనకు అపారమైన గౌరవాభిమాన వాత్సాల్యాలున్నాయనీ, విరామ సమయాలను తండ్రి సేవలోనే గడుపుతాననీ, తనకాయన దైవమనీ చెబుతూ, ఉద్యోగ ధర్మంలో కూడా తండ్రి నెలా కాపాడుకుంటున్నదీ, సేవలు చేస్తున్నదీ చెప్పడాన్ని రాజు సావధానంగా విన్నాడు. ఇంతమంది సైనిక వీరుల్ని, తననీ మంచి సూచనతో ప్రాణరక్షణకు తోడ్పడిన అతని తండ్రిని తన వద్దకు పిలుచుకుని రమ్మన్నాడు. అతణ్ణి జూచి ఆనందిస్తూ అక్కడికక్కడే తన మెడలోని హారాన్ని తీసి, బహుమతిగా ఆ వృద్ధుడి మెడలో అలంకరిస్తూ, జేజేలు పలికాడు, జై, జై ధ్వానాలు చేయించాడు. సైనికుడు చేసిన తన శాసన ధిక్కారాన్ని క్షమించాడు. ప్రక్కనున్న మంత్రులు, సైన్యాధ్యక్షులు అందరూ ఆ వృద్ధుణ్ణి అభినందిస్తూ, సైనికుని పితృభక్తినీ, పెద్దలపట్ల గల సేవానురక్తినీ ప్రశంసిస్తూ, వారూ జయ జయ ధ్వనాలు సలిపారు. అప్పట్నుంచీ రాజు పెద్దల పట్ల భక్తిగౌరవాలు కలిగి ఉండాలని ప్రజలను శాసించాడు. ఆనాటి నుంచీ జపాను దేశంలో పెద్దలపట్ల పిన్నలకు రెట్టించిన అభిమానం గౌరవం ఏర్పడింది. భక్తి ప్రపత్తులను ప్రదర్శించడం ఆచారంగా వస్తూన్నది.

ఇప్పటికి కొన్ని దేశాల్లో వయసుమళ్ళినవారిని (సీనియర్ సిటిజన్స్) గౌరవించాలనీ, వారికి సకల విధ సౌకర్యాలూ కల్పించాలనీ, వారి సలహాలను పాటించాలనీ, భావిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సలహాదారులుగా నియమిస్తున్నారు. భారతదేశంలో మాత్రం ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై తరువాత తమ కుటుంబ పెద్దలను గౌరవించకుండా, ఆదరించకుండా, అనాథ శరణాలయాలకు పంపడం, వారు అనాథలుగా జీవించడమూ జరుగుతున్నది. ఇదొక దురదృష్టకర విషయం. రెండువేల సంవత్సరాలు దాటి ఇరవై ఒకటవ శతాబ్దిలో, ప్రస్తుత ప్రపంచ పరిణామాల దృష్ట్యా, ముఖ్యంగా భారతదేశంలోని యువత పెద్దలను గౌరవించడము, వారి సలహాలను స్వీకరించి ఆచరించడం అవసరం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానపరంగా గ్రహించడం ఎంతో అవసరం. ఇప్పటి యువత రేపు పెద్దవారై అనుభవశూన్యులైతే ప్రయోజనం ఉండదు సరికదా, మనం మన దౌర్భాగ్యంగా భావించవలసి వస్తుంది. ఆ ప్రమాదం కలుగనీయకుండా పెద్దలను గౌరవిస్తూ, వారి అనుభవసారాన్ని గ్రహించండి. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

b-d

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

మహిమలు గల చల్లని తల్లి జొన్నవాడ కామాక్షమ్మ

అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ దయాంబుధి అమ్మ అంటూ వీధుల్లో సోది సోది అని తిరిగే మహిళల నోట జొన్నవాడ కామక్షమ్మ పేరు చిన్నతనంలోనే విన్నాను. మంచి సమయం వస్తేనే అలాటి ముగ్గురు అమ్మలను ఒకే అమ్మలో చూడగలం.

1979వ సంవత్సరంలో మా పెద్ద అక్కగారి రెండో కుమారుడు ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరుకి దాదాపు 12, 13 కి.మీ. దూరంలో ఉన్న జొన్నవాడ కామాక్షమ్మ దర్శనానికి తీసుకొని వెళ్లాడు. ఆ అమ్మవారు ఎన్నో మహిమలు గల అమ్మని చెప్పాడు.

అష్టాదశ పీఠములలో అమ్మవారిలా ఆ చల్లని తల్లి నాకు ఎన్నో మహిమలు చూపిస్తూ ఈనాటికీ నన్ను, నా కుటుంబాన్ని కాపాడుతూనే ఉంది.

మధుర మీనాక్షి అమ్మవారు, కంచి కామాక్షి అమ్మవారు, శ్రీశైల భ్రమరాంబ అమ్మవారు, మైసూరు చాముండేశ్వరి అమ్మవారు, విజయవాడ కనకదుర్గ అమ్మవారు, రామేశ్వరం పర్వతవర్ధిని అమ్మవారు, కాశీ అన్నపూర్ణ అమ్మవారు మొదలుగా గల మహాక్షేత్రములలో నాకు ఎక్కడా కనిపించని ఒక దివ్యశక్తి ఆ జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారిలో కనిపించి నన్ను ఆకర్షించి చిరునవ్వుతో ఆశీర్వదించి నట్లుగా ఒక గొప్ప దివ్యానుభూతి నాకు కలిగింది. అది అనుభవించినవారికే తెలుస్తుంది.



ఆ కామాక్షమ్మ దివ్యమంగళ స్వరూపము

నెల్లూరు సమీపాన పెన్నానది ఒడ్డున జొన్న వాడలో కామాక్షమ్మ అమ్మవారు నిత్యపూజలందు కుంటూ త్రికరణశుద్ధిగా నమ్మి, పూజిస్తున్న భక్తులను తన చల్లని చూపులతో ఆశీర్వదిస్తూ, తన మహిమ లను చూపిస్తూ కాపాడుతూనే ఉంది.

కామాక్షమ్మ అమ్మవారి విగ్రహం చిన్నదిగా ఉండి, ముఖం కోటి సూర్య ప్రభా సమానంగా వెలిగి పోతోంది. నాసికకు తళతళ మెరిసే ముక్కుపుడక, చెవులకు మెరుస్తున్న బంగారు దుద్దులు, (అంటే లలితా సహస్రనామాలలో చెప్పినట్లుగా 'తాటంక యుగళీభూత్ తపనో రూప మండలా' అని ఉంది) గుండ్రని నోరు, దానిమ్మ గింజల్లాంటి పళ్ళు, మెడలో దివ్య కాంతులు వెదజల్లే మంగళ సూత్రం (కామేశ బద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా' అని కూడా) నిండుగా గుండ్రంగా ఉన్న పాలిళ్లు (నాభ్యాలవాల రోమాళీ లతా ఫలకుచద్వయీ' అని) కుడిచేతిలో బంగారు దండం (కర్ర) ఎడమచేతిలో పొడుగాటి ఆయుధం, మరోచేతిలో చెండాకోలు, ఇంకో చేయి భక్తులకు అభయ హస్తం ఇస్తోంది. నడుముకు వడ్డాణం, ఇంద్రధనస్సు లాగా మెరిసిపోతోంది. అనేక రంగులు ఉన్నయా అన్నట్లుగా శిరస్సుపై ఆకర్షించే కిరీటం ఒక్కసారి ఆ జొన్నవాడ కామాక్షమ్మను చూస్తే, ఆ అమ్మవారిని మరచిపోలేము.

7-3-2001న జొన్నవాడ వెళ్లి ఆ కామాక్షమ్మ అమ్మవారికి పూజ చేయించి నప్పుడు నాకు తెలియకుండానే ఆశుకవిత్వంలాగా నా నానోటి వెంట

ధనమూలేదు, ధైర్యమూలేదు
భాష తెలియదు, నివాసం లేదు,
ఊరున్ కొత్త, బంధుమిత్రులు అసలేలేరు
ఉన్నది నీ వక్కత్తివే నాకు కామక్షమ్మా
నిన్నే నమ్మి అహరనిశలు ధ్యానించు చుంటి తల్లీ
ఇతఃపరం బెరుంగ నీ పాదముల సాక్షిగా
అమ్మా కామాక్షమ్మా ధైర్యము ఆత్మస్థయిర్యమును
సదా నీవు నా హృదయంబునందు ఎల్లవేళలన్

చెన్నై యందు నా నివాసము స్థిరముగా చేయుము - అని ప్రార్థించి 8-7-2001న చెన్నైలోని ప్రియదత్త కార్యాలయంలో (అమృతాంజనం వారిది) ప్రూఫ్‌రీడరుగా చేరాను.

పైన చెప్పిన వేడికోలుని సుప్రసిద్ధ, సంస్కృతాంధ్ర మహాపండితులైన పులభారతి అని చిన్న చిన్నంలోనే బిరుదు పొందిన శ్రీమల్లంపల్లి శరభేశ్వరశర్మగారికి (2007లో లింగైక్యం చెందారు) వినిపించగా భాష, భావం చాలా బాగున్నాయని నన్ను 'జొన్నవాడ కామాక్షమ్మ అనుగ్రహ ప్రాప్తిరస్తు' అని నన్ను ఆశీర్వదించారు.

జొన్నవాడ కామాక్షమ్మ నాకు చూపిన మహిలు కొన్ని

హైద్రాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న నాకు చెన్నైలోని ప్రియదత్త కార్యాలయం వారు వెంటనే వచ్చి చేరమని ఆర్డరు పంపి నెలదాటిన ఆ ఉద్యోగం నా కోసం అన్నట్లు ఉంచి నన్ను చేర్పించింది కామాక్షమ్మ అమ్మే!

చెన్నైలో నేను ఒంటరిగా వుండి వండుకుని తింటున్న రోజుల్లో (2001)లో 3 అంతస్థులో నీరు కింద నుండి పైకి మోసుకు వెడుతుంటే నా కుడిచేయి మోచేతికి విపరీతంగా నొప్పి వచ్చింది. డాక్టరు దగ్గరకి వెడితే తగ్గి మళ్లీ 3వ సారి వస్తే డాక్టరు ఆపరేషన్ చేయాలని చెప్పారు. భయపడ్డాను. వెంటనే జొన్నవాడ వెళ్లి అమ్మవారి పాదముల దగ్గర ఉన్న కుంకుమను నొప్పి ఉన్నచోట ఒక్కసారి రాయగానే చేత్తో తీసివేసినట్టుగా నొప్పి పోయింది.

ఒకసారి ప్రియదత్త కార్యాలయం నుండి రాత్రిపూట ఇంటికి వస్తూ హోటల్‌కి వెడితే పెద్దవాన వచ్చింది. అప్పుడు నా జేబులో ఉన్న ఆ కామక్షమ్మని ప్రార్థించగా అంతపెద్ద వాన వెంటనే స్విచ్‌తీస్తే లైటు పోయినట్లుగా ఆగిపోయింది. ఇలా రెండు సార్లు జరిగింది.

2014లో చెన్నైలో సైకిల్‌మీద వెడుతూంటే వెనకనుండి ఒక యువకుడు ఒక మోటారు సైకిలుపై వచ్చి నన్ను చాలా స్పీడుగా గుద్దేస్తే పైకి బంతిలాగా నేను, నా సైకిల్ ఎగిరి కిందపడినపుడు తలపగలడమో, కాళ్ళు చేతులు విరగడమో కాకుండా నా కాలికి చిన్న దెబ్బతో సరిపెట్టి నన్ను కాపాడింది జొన్నవాడ కామక్షమ్మ. ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధమైన బాలభారతి కార్యాలయంలో నేను ఇప్పుడు ఉద్యోగం చెయ్యడం ఆ అమ్మబలమే. 2011లో జొన్నవాడలో ఒక భక్తురాలికి పూనకం వచ్చి నాకు జాతకం చెప్పింది. మీ ప్రియదత్త కార్యాలయం మూసేస్తారు. నీవు చెన్నైలో కొద్ది కాలం ఉండవు. చెన్నై పరిసరాలు దాటిపోవు. మళ్లీ చెన్నై వచ్చేస్తావు అని ఒక మహిళ రూపంలో ఆ జొన్నవాడ కామక్షమ్మ చెప్పింది. నాకు అక్షరాలా ఆ అమ్మ చెప్పినట్లే జరిగింది.

అప్పటి నుండి నా శరీరంలోని ప్రతి అణువులోనూ ఆ కామాక్షమ్మ జీర్ణించుకుని పోయి నిండిపోయింది. ఏది చేసినా ఆ అమ్మకి చెప్పి, ఆ అమ్మ మీదే భారం వేసి చేస్తాను.

ఈ చెన్నై మహానగరంలో నేను బతుకుతున్నాను. అంటే ఆ అమ్మ దయే.

36 సంవత్సరాలుగా నన్ను కాపాడుతూ, నన్ను రక్షిస్తున్న ఆ జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారికి శత సహస్ర వందనాలు త్రికరణశుద్ధిగా అర్పిస్తూ

ఆ జొన్నవాడ కామాక్షమ్మ పాదరేణువు

- మల్లంపల్లి రామప్రసాదు

వ్యాసాయ సమాజ హితాయ

ఆషాఢ మాసంలో వచ్చే పూర్ణిమను సంప్రదాయానుసారం గురుపూర్ణిమగా జరుపుకుంటున్నాము. మన సమాజానికి మొట్టమొదటి గురువు వేదవ్యాసుడు జన్మించిన శుభదినమిది.

ఋషులు అంటే అడవుల్లో ఉండేవారే కాక అవసరమైనప్పుడు సమాజాన్ని నడిపేవారని మనం గమనించాలి. వ్యాసునికి పూర్వం వేద మంత్రాల్ని అందించిన అనేకమంది ఋషులున్నా వారికి గురువు అనే పేరు రాలేదు. సుమారు ఐదువేల ఏళ్ల కిందట జరిగిన మహాభారత చరిత్రకు సాక్షి వ్యాసుడు. సమాజంలోని వివిధ వ్యవస్థలు అప్పుడప్పుడు రూపొందుతున్న సమయం. ఆ వ్యవస్థల ఏర్పాటుకు మేధోనాయకత్వం వహించి వాటిని రూపొందించిన ఘనత వ్యాసుడొక్కనిదే.

భారతీయ సమాజ వ్యవస్థలో ఒక విప్లవాత్మకమైన మార్పు తెచ్చిన వ్యక్తి వేదవ్యాసుడు. కపిల మహర్షి చెప్పి సాంఖ్య సిద్ధాంతం ప్రకారం ప్రకృతిలో సత్యము, రజస్సు, తమస్సు అని మూడు గుణాలు. వీటి కలయిక వల్లే సృష్టి జరుగుతుంది. ఒకరు సాత్వికుడు, మరొకడు రజోగుణం కలవాడు. ఇంకొకడు తామసంగా ఉండేవాడు. ఇలా సృష్టిలోని వైచిత్రి, ప్రకృతిలోని ప్రతి వస్తువులోను, మనం తినే ఆహార పదార్థాల్లోనూ ఈ గుణాలున్నాయి. వేదాల పూర్వభాగాలైన యజ్ఞకాండలో కానీ తర్వాతి భాగాలైన ఉపనిషత్తుల్లో కానీ ఈ గుణాల ప్రస్తావన లేదు. రెండు ఉపనిషత్తుల్లో మాత్రం పరోక్షంగా వీటి ప్రస్తావన ఉంది. వ్యాసుడు ఈ గుణాలు అనే భావాన్ని ముందుకు తెచ్చి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అంతకు పూర్వమే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే వర్ణవ్యవస్థ ఉన్నా.. అది పై మూడు గుణాల కారణంగా ఏర్పడిందని అదివరకు గ్రంథాల్లో లేదు. మొదటిసారిగా ఈ వర్ణవ్యవస్థను మూడు గుణాల కారణంగా జరిగిందని మహాభారతంలో పలుచోట్ల చెప్పడం ఒక విప్లవాత్మకమైన మార్పు. దేవుడేదో నాలుగు వర్ణాల్ని సృష్టించాడని అప్పటివరకు ఉన్న భావన. పురుష సూక్తంలోనూ, బృహదారణ్యక ఉపనిషత్తులాంటి వాటిల్లోనూ గుణాల ప్రసక్తి లేదు. వ్యాసుని కాలానికి వర్ణవ్యవస్థపై తీవ్ర చర్చ బయల్దేరినట్లు భారతంలో వివిధఘట్టాల్ని చూస్తే తెలుస్తుంది.

వర్ణవ్యవస్థను దేవుడు... వ్యక్తి పుట్టుక ఆధారంగా చేశాడా? వ్యక్తి ప్రవృత్తి, గుణం ఆధారంగా చేశాడా? అన్న ప్రశ్నకు మొట్టమొదట ధైర్యంగా సమాధానం చెప్పడానికి సాంఖ్యులు చెప్పిన మూడు గుణాలు ఈయనకు చాలా ఉపయోగించాయి. భగవద్గీతలో ఈ గుణాల గూర్చి ఒక ప్రత్యేక అధ్యాయమే ఉంది. అనుశాసన, శాంతి పర్వాల్లో ఇంకా వివరంగా చెప్పాడు. సంఘసంస్కర్తగా వ్యాసుని పాత్ర ఒక గొప్ప పరిశోధనకు అవకాశమున్న విషయం.

వేదవ్యాసుని పేరు వల్లే అతనికి వేదాలతో సంబంధం ఉన్నదని తెలుస్తుంది. మొదట్లో వైదిక సాహిత్యమంతా కలగూరగంపగా ఉండేది. వ్యాసుడు వాటి స్వరూపాన్ని ఉపయోగించే విధానాన్ని బట్టి నాల్గింటిని విభజించాడని మనం విన్నదే.

వ్యాసుని కాలానికి త్రయీ, అంటే మూడు వేదాలు అని స్థూలంగా గుర్తించినట్లు తెలుస్తుంది. అథర్వణ, వేద మంత్రాలు లౌకిక ప్రయోజనాలతో సంబంధం ఉన్నవి. రాజుల పట్టాభిషేకం ఎలా జరగాలి, రాజులో సర్వదేవతల అంశాల్ని ఎలా ఆవాహనం చేయాలి, శత్రువులపై దండయాత్రలకు వెళ్లే సమయంలోచేయాల్సిన యజ్ఞాలు మొదలైనవి. అందేగాక వైద్యశాస్త్రానికి సంబంధించిన విషయాలు అనేకం. వీటికి మిగతా వేదాలతో సమానస్థాయి ఇవ్వడంపై వ్యాసుని సమయంలో గొప్ప చర్చ జరిగినట్లు తెలుస్తుంది. వ్యాసుని చొరవతో అథర్వణవేదం మిగతా వాటితో సమాన స్థాయిని పొందిందని పండితుల అభిప్రాయం. అథర్వణ వేదం తెలిసినవారే రాజపురోహితులుగా ఉండేవారు. యజ్ఞాల్లో కూడా ముఖ్యపాత్ర లభించింది. ఇప్పటికీ ఈ వ్యవస్థ అనుసరింపబడుతోంది.

వ్యాసుడు చేసినమరొక గొప్పపని ఇతిహాసం, పురాణం అనే ప్రక్రియల్ని ప్రారంభించడం. మహాభారతంలోని మొదటి సర్గలోనే ఒక సూత్రప్రాయమైన వాక్యాన్ని రాశాడు. 'ఇతిహాస పురాణాల ద్వారా వేద సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వేదం మాత్రమే చదివినవాడిని చూసి వేదమాత భయపడుతుంది' అని చెప్పాడు. వేదంలో చెప్పిన విషయాలకు వ్యాఖ్యానంలా ఇతిహాసాన్ని, పురాణాల్నీ రాయాలి అని సూత్రీకరించడం గొప్ప విషయం. వ్యాసుడే రాసిన భారతం ఒక ఇతిహాసం. ఇందులో ఆధ్యాత్మిక విషయాలపై చర్చయే కాక, సామాజిక, రాజనీతి విషయాలపై కూడా విస్తారమైన చర్చ ఉంది. అందుకే దీన్ని కొందరు ధర్మశాస్త్రమన్నారు. కొందరు రాజనీతి శాస్త్రమన్నారు. కొందరు కావ్యమన్నారు. కొందరు పురాణమన్నారని వ్యాసుడే వ్యాఖ్యానించారు.

సమాజానికి గురువు అనదగిన వ్యక్తి సమాజంలోని అన్ని స్థాయిల్లోని వారికీ వారి వారి ఆలోచనాస్థాయిని అనుసరించి చెప్పగలిగి ఉండాలి. ఈ దృష్టికోణంలో వ్యాసుణ్ణి చూస్తే భారతంలో పండితుల్ని ఆకట్టుకునే అతి సునిశితమైన విషయాలు అనేకం. వీటితోపాటు కథానికలు అనేకం. మనం ప్రస్తుతం చూసే పంచతంత్రం, హితోపదేశం లాంటి కథలకు కూడా వ్యాసుడే మూలమని భారత చూస్తే తప్ప తెలియదు. పంచ తంత్ర కథల్లాంటి జంతువుల కథలు అనుశాసన పర్వంలో భీష్ముడు ధర్మరాజుకు రాజనీతి చెప్పే సమయంలో అనేకం కనిపిస్తాయి. పీహెచ్‌డీ చదివిన వాళ్లు కేజీ స్థాయి నుంచీ పీజీ స్థాయి వరకూ చెప్పగలిగినపుడే ఉత్తమ అధ్యాపకులు అవుతారు. వ్యాసుడు ఆ కోవకు చెందినవారు.

మతాలు సాధారణంగా దేవుడంటే ఇలా ఉంటాడు. స్వర్గం ఇలా ఉంది. నరకం అలా ఉంది. పాపుల్ని ఇలా రక్షిస్తాడు. ఇదే పరమసత్యం అని ప్రచారం చేస్తాయి. వ్యాసుడు రాసిన 'బ్రహ్మసూత్రాలు' అలా కాకుండా దేవుడు అంటూ 'డు' ప్రత్యయం కూడా నిర్దేశించడాన్ని ఒప్పుకోదు. దేవుడు అనేది ఒక వ్యక్తా లేదా తత్వమా, సృష్టి అంటే ఏమిటి, దానికి ముడిసరుకు ఏమిటి, దేవుడికి రూపం ఉందా మొదలైన ప్రశ్నల ప్రస్తావన, దానిపై వాది, ప్రతివాదుల చర్చ, ఆ తర్వాత సిద్ధాంతం అనే ధోరణిలో రాసిన పుస్తకం ప్రపంచ చరిత్రలో మరెక్కడా లేదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

వ్యాసుని వ్యక్తిగత విషయానికి వస్తే అతడు ఒక పల్లెకారి స్త్రీ కొడుకు. అతడ్ని ఒక మహర్షిగా మన ప్రాచీన సమాజం గౌరవించడమే కాక సమాజానికి గురువుగా గుర్తించడం మనకు గర్వకారణం.

(డా.కె. అరవిందరావు, రిటైర్డు డీజీపి వ్యాసం ఆధారం)

అమెరికాలోని ఆస్టిన్ నగరమంటే నాకెంతో ఇష్టం

అక్కడ నా ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరాలయం ఉన్నది

మా మూడవ అబ్బాయి నాగసాయీ ప్రసాద్ తొలుదొల్త ఆస్టిన్ నగరంలోనే ఉండేవాడు. అప్పుడు డాలస్ నగరంలోనే విమానం దిగి, 80 మైళ్ల దూరంలో ఉన్న ఆస్టిన్‌కు కారులో వెళ్లేవాళ్ళం. ఆస్టిన్‌లోనే అనేకమంది దక్షిణ భారతీయులుండే వారు. ఆస్టిన్‌కు 80 మైళ్ల దూరంలో టెక్సాస్ ఉండేది. ఆ టెక్సాస్ నగర శివార్లలో ప్రసిద్ధిగొన్న అమ్మవారి ఆలయం ఉంది. ఆ ఆలయ అంతరాలయంలోనే జ్యోతి అనే కన్యకా అమ్మవారి ఆలయం ఉన్నది. ఆమెను అక్కడి అర్చకులు పరమేశుని కుమార్తెయని చెప్పారు. అలాంటి కన్యకా విగ్రహాన్ని నేనెక్కడా– అంతకు పూర్వంగానీ, ఆ వెనుకనుగానీ చూడలేదు.

ఆ ఆలయంలో అమ్మవారికి నివేదించిన రుచ్యమైన పులిహోర విక్రయించేవారు. మాతో వచ్చిన మిత్రులు– "త్వర త్వరగా వెడదామురా – ఆలస్యంగా వెడితే పులిహోర దొరకదు" అనేవారు. వెనుతిరిగి వచ్చే మార్గంలో ఓ చిన్నకొండ కనిపించింది. ఆ కొండమీద ఆలయంలో వేంకటేశ్వరుణ్ణి సందర్శించాం. అక్కడి అర్చకులు గుంటూరుకు చెందినవారు, ఆయన పేరు నరసింహంగారని జ్ఞాపకం. ఆయనతో తెలుగులో మాట్లాడుతూ 'ప్రముఖాంధ్ర' యివ్వగానే –అప్పటికప్పుడే సాలుచందాగా ఉంచమని కొన్ని డాలర్లు యిచ్చారు.

ఆ కొండకు 80 మైళ్ల దూరంలో ఉన్న తెలుగు, తమిళుల ఇళ్ళల్లో జరిగే వ్రతాలూ, పూజలూ జరిపిస్తుండేవారు. ఆయనే కారును నడుపుతూ, వందమైళ్ల సుదూరమైనా వచ్చేవారు. అంత కన్నా ఆశ్చర్యం ఏంటంటే– ఉచితంగా పత్రికను గ్రహించనని ప్రతి సంవత్సరమూ డాలర్ లెఖ్ఖలోనే సాలుచందా పంపిస్తుండేవారు.

జిల్, క్రెగ్ దంపతులతో వ్యాస రచయిత

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలోని ఓ ప్రశాన్త నగరం. అందరికీ సులభుడై అంతరాత్మయన్నవాడు.. దాకొని బ్రహ్మాండాలు ధరించిన బ్రహ్మము' అని అన్నమాచార్య ఆలపించినట్లు, ఇందుగలదందులేదని సందేహము వలదు. ఎందెందు వెదకి చూచిన... అని భాగవతోత్తముడు సులభమార్గం చూపించినట్లు... భక్తసులభుడన్న కీర్తిని సార్థకం చేయడానికన్నట్లు వేంకటేశప్రభుడు ఇప్పుడు సప్తగిరీశుడయిన శ్రీవేంకటేశ్వరుడు ఎక్కడ నా వారుందురో అక్కడ నేనుందును అంటూ ప్రత్యక్షమవు తున్నాడు.

వేంకటవిభుడు పలు చోట్ల వెలసినా, ఆస్టిన్‌లో 'అవతరణ'కు ప్రత్యేకత ఉంది. అమెరికాలో ఆయనకు బస ఏర్పాటు చేస్తున్న దంపతులు కేవలం ఆయన భక్తులే కాదు. భారతీయాన్ని, భారతీయ సంస్కృతిని, భారతీయ ఆధ్యాత్మికతను, భారతీయులను అమితంగా ప్రేమించే అమెరికా పౌరులు కావడమే విశేషం.

ఈ శ్వేతకపోతాల పేర్లు క్రెగ్, జిల్. భారతీయం పట్ల, విశ్వమానవ కళ్యాణాన్ని కాంక్షించే భారతీయుల సువిశాల ఆధ్యాత్మిక దృక్పథం పట్ల, ముఖ్యంగా వారి యోగ విద్య పట్ల వీరు ఎంతగా ఆకర్షితులయినారంటే..

ఆస్టిన్‌లోని సెడార్క్ ప్రాంతంలో 9 ఎకరాల విస్తీర్ణంలో పూర్తి భారతీయ ఆగమ శాస్త్ర ప్రకారం, అదే సంస్కృతిని, అదే శిల్పా కళా చాతుర్యాన్ని ప్రతిబింబిస్తూ 12 మిలియన్ డాలర్ల (రూ.74 కోట్లతో) ఖర్చుతో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మించారు. దీనికి మన దేశం నుండి 21 మంది శిల్పులు వెళ్లారు. 250 టన్నులు తూగే 10 వేల రాళ్లను కూడా మహాబలిపురంలో చెక్కించి నౌకల ద్వారా తెప్పించుకుంటున్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతీ దేవి, శివుడు, పార్వతిదేవి, సుబ్రహ్మణ్యస్వామి, దుర్గాదేవి, రాముడు, కృష్ణుడు, గణపతి, నవగ్రహాలతో సర్వభక్తజన రంజకంగా ఈ ఆలయ సముదాయం ముస్తాబయ్యింది.

ప్రతిష్టాపన మహోత్సవాలు టిటిడి చేర్మన్ కనుమూరి బాపిరాజు, మంగళంపల్లి బాల మురళీకృష్ణ, కెఎస్‌రాజు (నాగార్జున ఫెర్టిలైజర్స్) తదితరుల సమక్షంలో జరిగాక్ష్మిఇ.

క్రెగ్, జిల్ ఎడ్వర్డ్స్ హవాయి ద్వీప ప్రాంతానికి చెందిన వారు. యుక్తవయస్సులోనే వీరిద్దరూ యోగ, వేదవిద్యపై ఆసక్తి పెంచుకున్నారు. 1970 ప్రాంతంలో వీరిద్దరు మెడిటేషన్‌పై అధ్యయనం నిమిత్తం యూరోప్ దేశాలకు వెళ్లారు. 1978 ప్రాంతంలో ఫెయిర్‌ఫీల్డ్‌లోని మహర్షి ఇంటర్నేషనల్ యూనివర్శిటీలో యాదృచ్ఛికంగా కలుసు కున్నారు.

ఇద్దరి అభిరుచులూ, ఆసక్తులు కలవడంతో పరిచయం ప్రేమగా మారి, 1979లో వివాహం చేసు కున్నారు. వేద విజ్ఞానం, అందులోని నైతిక విలువలతో కూడిన సంఘ జీవనం, వేద సంస్కారాలు, క్రియల పట్ల వారిలో మరింత ఆసక్తి పెరిగింది. ఇద్దరూ కలిసి భారతదేశం పర్యటించారు.

ఈ క్రమంలోనే 2000–2010 సంవత్సరాల మధ్యలో ఈ దంపతులు దాదాపు ఇరవై దఫాలకుపైగా భారతదేశంలో పర్యటించారు. ఈ క్రమంలోనే కాకినాడలో ఏర్పాటైన వేదపాఠశాల నిర్మాణానికి ఇతోధికంగా ఆర్థిక సహాయం చేశారు.

భారతదేశంలో నిర్వహించిన వివిధ ప్రపంచ శాంతి యజ్ఞాల్లో పాలుపంచుకున్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లోని ధార్మికత, మానవీయ విలువల వైశిష్ట్యం వీరిని మరింతగా ఆకర్షించాయి. క్రెగ్, జిల్ దంపతులు అన్వేషణ ఇలా సాగుతూనే ఉంది.

భారతీయ వేదవిజ్ఞానం, ఆధ్యాత్మికతలోని సారం గురించి తెలుసుకునే కొద్దీ ఎన్నెన్నో ఆసక్తికరమైన విషయాలు... అబ్బురపరిచే ధర్మ సూత్రాలు వారిని కట్టిపడేశాయి. ఈ క్రమంలోనే పలుమార్లు ఈ దంపతులు షిర్డీలో సాయిబాబాను దర్శించుకున్నారు.

సత్యమే పునాదిగా, పరిపూర్ణ మానవత్వంతో సమాజం నడవాలన్న షిర్డీ సాయిబాబా మానవతా బోధనలకు ఆకర్షితులైన ఆస్టిన్ దంపతులు 2007లో ఇదే ప్రాంగణంలో రూ.25 కోట్లతో సాయిబాబా మందిరాన్ని నిర్మించి పూర్తి షిర్డీ తరహాలో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

– (రాజేశ్వరి అన్నవరపు వ్యాస మూలాధారం)

సూర్యోయధాన్ధం హితమో నిహన్తి
విష్ణుర్యధా దుష్ట జనాన్ ఛ్చినత్తి
తథైవ యస్యాఖిల నేత్ర లోభమ్
రూపం త్రితాపం విముఖీ కరోతి - (వివేకానంద పంచకం)

సూర్యుడు గాఢాంధకారాన్ని ఏవిధంగా నిర్మూలిస్తున్నాడో, విష్ణువు దుష్టులను ఏవిధంగా శిక్షిస్తాడో ఆవిధంగా ముఖ తేజస్సు త్రితాపాలను (ఆది భౌతిక, ఆధ్యాత్మిక, ఆదిదైవిక) తొలగిస్తుందో, ఆ వివేకానందునికి మరోసారి ప్రణామములు!!

'జననీ జన్మభూమిశ్చ్య స్వర్గాదపి గరీయశీ' జన్మనిచ్చిన తల్లి, జన్మించిన భూమి స్వర్గం కంటే ఉన్నతమైనవి, దేశభక్తిని మించిన మతం లేదు. భరతమాతను మించిన దైవం లేదు. మనిషి దేశాన్ని ప్రేమించడం, దేశాన్ని గౌరవించడం దేశం కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడడం అలవరచుకోవాలి, (నేర్చుకోవాలి) దీనిని బంకిమ్‌చంద్ర చటర్జీ 'వందేమాతరం'లో చాలా అందంగా చెప్పారు. భావోద్వేగంగా చెప్పారు. ఇదివరలో దీనిని జాతీయగీతంగా ఆలపించేవారు. స్వాతంత్ర్య సమయంలో ప్రతి జాతీయవాది కుదిరామ్ బోస్ నుంచి భగత్‌సింగ్ వరకూ వారి తుదిశ్వాసలో వారి పెదాలమీద వందేమాతరం పలికింది. స్వాతంత్ర్యం తరువాత జనగణమణ జాతీయగీతం అయ్యింది. బాబు రాజేంద్రప్రసాద్ జనగణమణను జాతీయగీతం చేశారు. అంతకు ముందు కూడా వందేమాతరం చివరి చరణాలు ఆలపించకుండా మొదటి రెండు చరణములు పాడేవారు. కారణం కొందరు ముస్లిం నాయకులు చివరి చరణాలలో హిందూ దేవతల గురించి చేసిన వర్ణనను వద్దన్నారని. కాని ఆ చివరి చరణాలలోని వర్ణన వున్నది భారత మాత గురించే. (ఇదే మనం భారతమాతకు యిచ్చిన గౌరవం).



అప్పటిలో స్వామి వివేకానంద వంటివారు దేశాన్ని గురించి, మళ్లీ ప్రజలలో చైతన్యం తేవడానికి ప్రయత్నించారు. ఇప్పటి రాజకీయ నాయకులలాగా 70,80 ఏళ్లు ఆయన బ్రతికుంటే బాగుండేదేమో, ఈ దేశం ఇంకా బాగుండేదేమోనని అనిపిస్తోంది. అతి చిన్న వయస్సులో 40 ఏళ్లు దాటకుండానే భారతమాత స్వామిని తన ఒడికి చేర్చుకుంది. వందేమాతరం గీతంలో Inspire అయిన వివేకానందుడు పరాశక్తిని ఆరాధించడం, ఆ శక్తిలో భారతమాతను చూడడం ప్రారంభించారు. అప్పటిలో ఆయన యువతకు పిలుపునిస్తూ స్వాతంత్ర్య సాధనకోసం– సామ, దాన, బేధ, దండోపాయాలను ఉపయోగించమన్నారు. Arise, Awake stop not till the goal is reached. అన్న వివేకానందుని మాటలే అప్పటి స్వాతంత్ర్య సాధన కోసం జరిపిన పోరాటంలో జనానికి తారకమంత్రంలా పనిచేశాయి.

తన యొక్క దివ్య బోధల్లో భారతదేశాన్నే కాక యావత్ ప్రపంచాన్నీ ఉర్రూతలూగించిన బ్రహ్మజ్ఞాని, చిరంజీవి యోగిపుంగవుడు స్వామి వివేకానంద.

మతాల మధ్య పరస్పర అవగాహనకూ, సర్వమత సమన్వయానికి, సామరస్యానికి ఏర్పరచిన చికాగో విశ్వమత మహాసభలలో – ఆ సభలకు విన్నూత శోభను చేకూర్చినది వివేకానందుని విశ్వవిఖ్యాతునిగా చేసి వన్నెకెక్కించినది ఈ అమెరికా సభలోనే.

విదేశాలలో భారతదేశంపై ఉన్న అపోహ తొలగి భారతదేశానికి విశిష్టస్థానం కల్పించింది వివేకానందుని ప్రసంగమే. ఆయన చికాగో ప్రసంగంలో మొట్టమొదటిగా 'అమెరికా సోదర సోదరీమణులారా' అన్న ముత్యాల లాంటి ముచ్చటైన మూడు ముక్కలు అక్కడివారి హృదయాలను స్పందింపచేసింది; ఆనందపరచి కరతాళ ధ్వనులతో సభా ప్రాంగణం మారుమ్రోగింపచేసింది. భారతీయ సంస్కృతినీ, ఆత్మీయతనూ కలబోసిన ఆ మాటలు ఆ దేశ ప్రజలలో వివేకానందునికి బ్రహ్మరథం పట్టేలా చేసింది. అనంతరం వివిధ దేశాల నుండి, మతాల నుండి వచ్చిన బాధితులకు, శరణార్థులకూ భారతదేశం ఆశ్రయం యిచ్చిన చరిత్రాత్మకసత్యాలనూ వివరిస్తూ, హిందూ మతం మత సహనం పాటించడమే కాకుండా, సర్వ మతాలను సాదరంగా ఆహ్వానించి తనలో ఇముడ్చుకొనే ఔదార్యం కల మతమని వివరించారు స్వామి. అతి ప్రాచీన మతమైన హిందూ మతం దినదినాభి వృద్ధి చెందుతూ పటిష్ఠమవడానికి కారణాలను చెబుతూ, ఇతరుల భావాలను తనలో కలుపుకొనే ఔదార్యం, ఇతర మతాలలోనే మంచిని గ్రహించి జీర్ణించుకొనే శక్తి కలిగి ఉండడమే హిందూమత విశ్వజనీనతకు, సుస్థిర పునాదికి సిద్ధాంతాలు, మూలసూత్రం అన్నారాయన.

రామకృష్ణ పరమహంస వివేకానందునితో – 'నువ్వొక పెద్ద మర్రి వృక్షంలా ఎదగాలి, నీ క్రింద, నీ నీడలో వేలకొలది జనం సేదతీర్చుకోవాలి' అన్నారు. అంతటి నమ్మకం ఆయనపై శ్రీ రామకృష్ణునికుండేది.

మత మార్పిడిల నుద్దేశించి ఆయన 'Keep the motto before you - elevation of the masses without injuring their religion' అన్నారు. అప్పటిలో ఎక్కువగా డబ్బుల ఆశతో మత మార్పిడులు జరిగేవి. అందుకే ఆయన పేదలకు సాయపడటంలో వారి మతానికి గౌరవం యిమ్మన్నారు.

ఆయనకు యువకులమీద అపారమైన నమ్మకముండేది. ఒక వంద మంది యువకులను నాకివ్వండి, నేను ఈ భారతదేశాన్ని సస్యశ్యామలం చేస్తానన్నారు. కాని ఈ కాలంలో యువకులు అభిమాన తారలకు కటౌట్‌లు పెడుతూ చావడం, వారిపేరు మీద పచ్చబొట్లు పొడిపించుకోవడం, ఇంకొంత మంది తారలకు గుడి కట్టించటం, క్రమశిక్షణా రాహిత్యం, దోపిడిగుణం, అశ్లీలతపట్ల మోజు, మాదకద్రవ్యాలకు బానిసలవుతూ శక్తివిహీనులు కావడం, ఉగ్రవాదం వైపు మొగ్గుచూపడం, కుటిల రాజకీయ నాయకుల చెప్పుచేతులలో సంఘ వ్యతిరేక కార్యక్రమాలలో తమ శక్తి యుక్తులను వృధాచేయడం జరుగుతూంది. భారతభూమిపై పుట్టినందుకు పులకించిపోయిన వివేకానందుడు ఇప్పటి పరిస్థితులను చూస్తే ఎంత విచారపడేవారో ననిపిస్తుంది. యువతలో ఉన్న ప్రతిభ, నవతకు, ఆర్థికాభివృద్ధికి, మానవవనరుల అభివృద్ధికి పాటుపడాలి.

ఒకే ఒక్క మానవుణ్ణి నేను ఉద్ధరించ కలిగినా నా జన్మ ధన్యమైనట్టే అన్నారు వివేకానంద. ప్రస్తుత కాలపరిస్థితులలో వివేకానందుని సందేశం అవస్యం స్మరణీయం !

భారతజాతి గర్వించదగ్గ వ్యక్తి స్వామి వివేకానంద. ఆయన సమాధి చెంది సంవత్సరాలయ్యాయి. వేడుకలు చేసుకుంటాము, ఆనందిస్తాం, కాని ఆయన చెప్పినవి మనం ఎంతవఱకూ ఆచరణలో పెట్టామో ఒకసారి గడచిన శతాబ్దం తిరిగి చూస్తే తెలుస్తుంది. ఆఖరికి ఆయన చరిత్ర కూడా చరిత్ర పుస్తకాలలో పాఠంలా గ్రంథస్తం కాకుండా కొంతైనా ఆచరణలో పెడితేనే ఆయనకు మనం అందించే గౌరవం, వందనమవుతుంది.

జై భారత జనయిత్రీ! దివ్యధాత్రీ! నీవే యీ శక్తిని యువశక్తిలో Inject చేయాలి!

GOTETI GRAPHICS

FOR COMPLETE PRINTING SOLUTIONS

- **Offset Printing**
- **Desk Top Publishing**
- **Prepress**
- **Postpress**

64 (16), Thambiah Road, West Mambalam,
Chennai - 600 033. INDIA **Tel : 2474 2091, 2371 6322**
E-mail : gotetigraphics@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
November 2016

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97